బీజేపీకి అసమ్మతి సెగ

- మధ్యప్రదేశ్‌లో టికెట్ల కేటాయింపుపై నిరసనలు
- అసంతృప్తులను బుజ్జగించేందుకు కోర్ కమిటీ
- 67 సిట్టింగ్ స్థానాలపై తెగని పంచాయితీ
- 9 మంది మంత్రులకు టికెట్ల నిలుపుదల!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్‌లో అధికార బీజేపీకి అసంతృప్తుల బెడద ఎక్కువైంది. ఇప్పటివరకు 136 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం 230 స్థానాలకు గాను మరో 94 మంది అభ్యర్థుల పేర్లు ఖరారు చేయాల్సి ఉంది. అయితే సిట్టింగులు, సీనియర్ నాయకులను కాదని ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి, కొత్త ముఖాలకు టికెట్లు ఎట్లా ఇస్తారని స్థానిక నాయకత్వం ప్రశ్నిస్తున్నది. దీంతో ఆందోళనకు గురైన అధిష్ఠానం అసమ్మతిని తగ్గించి, అసంతృప్తులను బుజ్జగించి పార్టీ వీడకుండా చూసేందుకు సీఎం శివరాజ్ సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నలుగురు బడా నేతలతో ఓ కమిటీని నియమించింది. ఒక్కో కమిటీ సభ్యుడు 300 మంది నేతలతో చర్చలు జరపాలని టార్గెట్ పెట్టింది. ఇంకా అభ్యర్థులను ప్రకటించని 94 సీట్లలో 67 స్థానాలు పార్టీ సిట్టింగ్ సీట్లే కావడం గమనార్హం.

ఇందులో 9 మంది రాష్ట్ర మంత్రులూ ఉన్నారు. ఆయా నియోజక వర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత వల్ల ఇంతవరకు అభ్యర్థులను ఖరారు చేయలేకపోతున్నారు. బీజేపీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకుని ఈ సారి ఎన్నికల్లో కొత్త ముఖాలకు అవకాశమివ్వాలని సంఘ్ పరివార్ నిర్దేశించటంతో అభ్యర్థుల ఎంపిక ఇబ్బందిగా మారిందని సమాచారం.

సీఎం సీటు కోసం పోటీ..

ప్రస్తుత ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్‌ను ఎన్నికల తరువాత మారుస్తారని, కొత్త ముఖ్యమంత్రి రేసులో తామంటే తాము ఉన్నామంటూ సీనియర్ నేతలు చేస్తున్న ప్రకటనలను కూడా పార్టీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. సీఎం రేసులో తానున్నానని నాయకులు చేస్తున్న వ్యక్తిగత ప్రకటనల వల్ల పార్టీకి మరింత నష్టం జరుగుతున్నదని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నది. వయసు, అనారోగ్య కారణాలను చూపుతూ ఇద్దరు మంత్రులను ఎన్నికల్లో పోటీ చేయవద్దని ఆదేశించింది. పార్టీలో ఎన్నో ఏండ్ల నుంచి కష్టపడుతున్న కార్యకర్తలు, నాయకులకు కాకుండా ఎన్నికలప్పుడు బీజేపీలో చేరిన ఇతర పార్టీల నాయకులకు ఎలా టికెట్లిస్తారని స్థానిక నాయకత్వం ప్రశ్నిస్తున్నది. దీంతో టికెట్ల కేటాయింపుపై పార్టీ అధిష్ఠానం మీన మేషాలు లెక్కిస్తున్నది.

40 మంది సిట్టింగ్‌లకు టికెట్లు కట్?

బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో 40 మందికి ఈసారి టికెట్లు కట్ చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ప్రజల్లో వ్యతిరేకత, ఆయా ఎమ్మెల్యేల విజయావకాశాలు తక్కువని వచ్చిన సర్వే ఫలితాల వల్ల చాలావరకు గెలుపు గుర్రాలనే ఎన్నికల బరిలో దించాలని సంఘ్ పరివార్ నాయకుల నుంచి బీజేపీకి ఆదేశాలు అందినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఒకవేళ సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇవ్వకపోతే వారు ఇతర పార్టీల్లోకి వెళ్లే అవకాశముందని, అందుకే ఆఖరి నిమిషం వరకు వారి పేర్లను అధిష్ఠానం నిలిపివేత జాబితాలో పెడుతున్నదని, అదే బీజేపీకి తలనొప్పిగా తయారైందని రాజకీయ విశ్లేషకుడు అరుణ్ దీక్షిత్ అభిప్రాయపడ్డారు.

రాజస్థాన్‌లో బీజేపీకి రాజే షాక్?

జైపూర్: బీజేపీలో తనకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై ఆగ్రహంతో ఉన్న వసుంధర రాజే.. సొంతపార్టీకి షాక్ ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. అసెంబ్లీ టికెట్ దక్కని వసుంధర విధేయులు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగనున్నట్లు సమాచారం. 'పార్టీ కోసం జీవితాన్ని అంకితం చేసిన నన్ను మోసం చేశారనిపిస్తున్నది. నా ప్రజలు నేను పోటీ చేయాలని కోరుతున్నారు. నేను పోటీ చేస్తాను' అని నగర్‌కు చెందిన అనితా సింగ్ గుర్జర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు నర్పత్ సింగ్ రిజ్వి, రాజ్‌పాల్ సింగ్ షెకావత్ కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మొదటి జాబితా విడుదలైన నేపథ్యంలో వందలాది మంది వసుంధరా రాజే మద్దతుదారులు శనివారం ఆమె అధికారిక నివాసం ముందు గుమికూడి ఆమెకు మద్దతు తెలిపారు. అసెంబ్లీ అభ్యర్థుల రెండో జాబితాను ప్రకటించే ముందు పార్టీ హైకమాండ్‌కు ఒక సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే వారిలా గుమికూడినట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో టికెట్ల కేటాయింపు బీజేపీకి తలనొప్పిగా మారే అవకాశమున్నట్లు కనిపిస్తున్నది.

శివరాజ్‌కు పోటీగా 'రామాయణ' నటుడు

భోపాల్: రానున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం, బీజేపీ నేత శివరాజ్ సింగ్ చౌహాన్‌పై ప్రముఖ నటుడు విక్రమ్ మస్తల్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపింది. బుధ్ని నియోజక వర్గంలో వీరిద్దరు పోటీపడనున్నారు. ఆదివారం కాంగ్రెస్ ప్రకటించిన 144 మందితో కూడిన తొలి అభ్యర్థుల జాబితాలో మస్తల్ పేరు కూడా ఉన్నది. 2008లో ప్రసారమైన 'రామాయణ' టెలివిజన్ షో సిరీస్‌లో హనుమంతుడి పాత్రతో విక్రమ్ మస్తల్ ఫేమస్ అయ్యారు. మాజీ సీఎం కమల్‌నాథ్ ఛింద్వారా నుంచి పోటీచేయనున్నారు.

మోదీ ఓ నకిలీ బీసీ!

- ఇది బయటపడుతుందనే కులగణనకు కేంద్రం జంకు
- జేడీయూ నేత నీరజ్ ఆరోపణలు

పాట్నా: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేందుకు విముఖత వ్యక్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై బీహార్ అధికార పార్టీ జేడీయూ మండిపడింది. ప్రధాని మోదీ నకిలీ ఓబీసీ అని, గుజరాత్‌లో గతంలో ఓబీసీల్లో చేర్పులకు సంబంధించిన వ్యవహారాలు బయటపడుతాయనే కులగణనకు జంకుతున్నదని విమర్శించింది. జేడీయూ అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ నీరజ్ కుమార్ ఆదివారం పాట్నాలో మీడియాతో మాట్లాడారు. తాను అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన వ్యక్తినని ప్రధాని మోదీ చెప్పుకోవడాన్ని ప్రశ్నించారు. 2002లో గుజరాత్ సీఎంగా ఉన్న సమయంలో ఎన్నికల లబ్ధి కోసం మోదీ తన కులం 'మోద్ ఘంచి'ని ఓబీసీ జాబితాలో చేర్చారని ఆరోపించారు. అయితే ఇది 1994లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిందని మభ్యపెట్టేందుకు మోదీ ప్రయత్నించారని అన్నారు. 1994లో 'ఘంచి'లోని ఆరు ఉప కులాల్లో ఘంచి(ముస్లిం) వర్గాన్ని మాత్రమే ఓబీసీలో చేర్చారని నీరజ్ కుమార్ వివరించారు. సంబంధిత కేంద్ర ప్రభుత్వ గెజిట్‌ను మీడియా సమావేశంలో చూపారు. ఆధారాలు ఉంటే తాను చెబుతున్న దాన్ని తిప్పికొట్టాలని బీజేపీకి సవాల్ విసిరారు.

ఐటీ శాఖ ప్రతినిధుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? డీకే శివకుమార్ ఫైర్

బెంగళూరు: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డీకే శివ కుమార్ ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ ప్రతినిధులుగా ఎందుకు ప్రవర్తిస్తున్నారని నిలదీశారు. కొందరు కాంట్రాక్టర్ల కార్యాలయాలు, ఇళ్లల్లో ఐటీ శాఖ అధికారులు సోదాలు చేసి, బెంగళూరులోని ఓ కాంట్రాక్టర్ వద్ద భారీగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో విలేకర్ల ప్రశ్నపై శివ కుమార్ స్పందించారు. అంతకు ముందు జేడీఎస్ నేత కుమార స్వామి, బీజేపీ నేత అశోక మాట్లాడుతూ, పెండింగ్ బిల్లుల పరిష్కారం కోసం కాంట్రాక్టర్ల నుంచి కాంగ్రెస్ నేతలు సొమ్ము వసూలు చేస్తున్నారని, ఈ సొమ్మును ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ఫోన్ సంభాషణ రికార్డు చేయడం.. గోప్యత హక్కును ఉల్లంఘించడమే

బిలాస్‌పూర్, అక్టోబర్ 15: వ్యక్తులకు తెలియకుండా వారి మొబైల్ ఫోన్ సంభాషణను రికార్డు చేయడం రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం వారి గోప్యత హక్కును ఉల్లంఘించడమేనని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. 38 ఏండ్ల మహిళ తన భర్త నుంచి భరణం కోరుతూ వేసిన వ్యాజ్యం విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. తనకు తెలపకుండా తన భర్త తాను ఫోన్‌లో అతడితో మాట్లాడిన మాటలను రికార్డు చేశాడని ఆమె కోర్టుకు ఫిర్యాదు చేశారు. ఆమె తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపిస్తూ ఆమెకు తెలియజేయకుండా ఆమె సంభాషణను రికార్డు చేసి దాన్ని తిరిగి ఆమెకు వ్యతిరేక సాక్ష్యంగా చూపలేరని తెలిపారు. ఈ వాదనతో ఏకీభవించిన జస్టిస్ రాకేశ్ మోహన్ పాండే ఈ నెల 5న ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టారు.

మావోయిస్టుకు పోలీసుల ప్రాణదానం

- ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డ నక్సలైట్
- 5 కిలోమీటర్లు భుజాలపై మోస్తూ దవాఖానలో చేర్చిన పోలీసులు

రాంచీ: శుక్రవారం రాత్రి.. జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా, హుస్సీపీ అటవీ ప్రాంతం.. పోలీసులు, మావోయిస్టుల మధ్య భీకర ఎన్‌కౌంటర్.. తుపాకుల మోతతో అడవి అంతా దద్దరిల్లింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు తీవ్రంగా గాయపడ్డాడు. అయితే సహచర మావోయిస్టులు అతన్ని అక్కడే వదిలేసి పారిపోయారు. భద్రతా సిబ్బందికి గాయాల బాధతో మూలుగుతున్న మావోయిస్టు కనిపించగానే వెంటనే అతడిని భుజాలపైకి ఎత్తుకుని, ఐదు కిలోమీటర్లు అడవిలో నడిచి ప్రాణదానం చేశారు. అతడి పట్ల పోలీసులు చూపిన మానవత, ఔదార్యంపై ప్రశంసలు వెల్లువెత్తున్నాయి. గత శుక్రవారం పోలీసులు యాంటీ మావోయిస్టు ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. గాయపడిన మావోయిస్టును భద్రతా సిబ్బంది భుజాని కెత్తుకుని ఐదు కిలోమీటర్లు నడిచి హత్తిబురు క్యాంపునకు చేర్చారు. దారిలో మావోయిస్టులు పాతిపెట్టిన ఐఈడీలు ఉంటాయని తెలిసి కూడా ఆ పోలీసులు తమ ప్రాణాలకు తెగించి ప్రాణదాతలుగా మారారు. క్యాంపు వైద్యులు క్షతగాత్రుడికి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం శనివారం హెలికాప్టర్‌లో రాంచీలోని దవాఖానకు తరలించినట్టు పోలీసు శాఖ తెలిపింది.

వన్ నేషన్.. వన్ స్టూడెంట్ ఐడీ!

- కేంద్రప్రభుత్వం యోచన
- ఆధార్ కార్డు తరహాలో అపార్
- దేశంలోని అన్ని బడులకు వర్తింపు
- విద్యార్థి అకడమిక్ చరిత్ర నిక్షిప్తం

న్యూఢిల్లీ: 'ఆధార్' తరహాలో దేశంలోని ప్రతి విద్యార్థికి ప్రత్యేక గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. 'వన్ నేషన్-వన్ స్టూడెంట్ కార్డు' తెచ్చే యోచనలో కేంద్ర విద్యా శాఖ ఉన్నది. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఇచ్చే ఈ గుర్తింపు నంబర్‌ను ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(ఏపీఏఏఆర్-అపార్)గా పిలువనున్నారు. అపార్ ఐడీ కార్డులు ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాలని అన్ని రాష్ట్రాలు, యూటీలను కేంద్ర విద్యా శాఖ తాజాగా ఆదేశించింది.

ఏమిటీ అపార్ ఐడీ?

అపార్ నంబర్‌ను విద్యార్థి జీవితకాల ఐడీగా పరిగణిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు అపార్ ఐడీ ఇవ్వనున్నారు. దీనిలో విద్యార్థి అకడమిక్ జర్నీ, చరిత్ర(విద్యా ప్రయాణం), విజయాలు నిక్షిప్తం అవుతాయని, అవసరమైన సమయంలో ట్రాక్ చేయొచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

క్యూఆర్ కోడ్ మాదిరిగా అపార్

విద్యార్థులకు కొత్త అపార్ గుర్తింపు కార్డుల జారీకి సంబంధించి తల్లిదండ్రులతో మాట్లాడాలని, అందుకు వారి సమ్మతి తీసుకోవాలని కేంద్రం అన్ని పాఠశాలలను కోరింది. అపార్ ఐడీ ప్రాముఖ్యతను వివరించేందుకు అక్టోబర్ 16-18 మధ్య తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించాలని సూచించింది. విద్యార్థికి అపార్ ఐడీ జారీకి సమ్మతి తెలిపిన తల్లిదండ్రులు.. ఏ సమయంలోనైనా దాన్ని ఉపసంహరించుకోవచ్చు. విద్యార్థుల డాటా రహస్యంగా ఉంటుందని, ప్రభుత్వ ఏజెన్సీలతో మాత్రమే పంచుకోవడం జరుగుతుందని ప్రభుత్వం పేర్కొన్నట్టు తెలిపింది. 'వన్ నేషన్-వన్ స్టూడెంట్ ఐడీ' స్కీమ్‌పై ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారామన్ మాట్లాడుతూ అపార్, నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ దేశంలోని విద్యార్థులకు క్యూఆర్ కోడ్ మాదిరిగా పనిచేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థి నేర్చుకొన్న ప్రతి నైపుణ్యం, సాధించిన విజయం అందులో జమ అవుతుందని అన్నారు.

యుద్ధంలోకి ఇరాన్?

- గాజాపై దాడులను ఇజ్రాయెల్ వెంటనే ఆపాలి
- లేకుంటే మేం జోక్యం చేసుకోవాల్సి వస్తుంది..
- ఐరాస ద్వారా ఇజ్రాయెల్‌కు సందేశం పంపిన ఇరాన్
- ఆహారం, నీరు, విద్యుత్తు లేక అల్లాడుతున్న పాలస్తీనియన్లు

గాజాలోని శరణార్థుల శిబిరం వద్ద నీటి కోసం ఖాళీ క్యాన్లతో తిరుగుతున్న చిన్నారులు

గాజా సిటీ: గాజాపై బాంబు దాడులు ఆపకపోతే తాము యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని ఇజ్రాయెల్‌ను ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితి ద్వారా ఇజ్రాయెల్‌కు ఇరాన్ ఓ ప్రైవేటు సందేశం పంపిందని జెరూసలేం పోస్టు ఆదివారం వెల్లడించింది. గాజాపై ఇజ్రాయెల్ సైన్యం బాంబు దాడులు ఆపాలని, లేకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని ఇరాన్ అందులో హెచ్చరించింది. ఐరాస సమన్వయకర్త టోర్ వెన్నెస్‌ల్యాండ్‌ను ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రి హుస్సేన్ లెబనాన్ రాజధాని బీరుట్‌లో కలిసారు. యుద్ధ పరిస్థితి తిపై చర్చించారు.

మరో హమాస్ కమాండర్ హతం

ఇజ్రాయెల్‌లోకి హమాస్ మిలిటెంట్ల చొరబాటు సూత్రధారి, కిబ్బుట్జ్ నిరిమ్‌లో ఊచకోతకు బాధ్యుడైన బిల్లాల్ అల్ కేద్రాను ఖాన్ యూనిస్ పట్టణంపై జరిపిన దాడుల్లో చంపేశామని ఇజ్రాయెల్ వైమానిక దళం ఓ ప్రకటించింది.

ఇద్దరు భారత సంతతి సైనికుల మృతి

ఈనెల 7న హమాస్ జరిపిన దాడుల్లో భారత సంతతికి చెందిన ఇద్దరు ఇజ్రాయెలీ మహిళా సెక్యూరిటీ అధికారులు మరణించారని అధికారిక వర్గాలు తాజాగా వెల్లడించాయి. యుద్ధంలో రెండు వైపులా మరణాల సంఖ్య 5,200కు పైగా చేరింది. 2,329 మంది పాలస్తీనియన్లు చనిపోయినట్టు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఇజ్రాయెల్‌లో 1300కి పైగా మరణించగా, ఇజ్రాయెల్ దాడుల్లో 1500 మంది హమాస్ మిలిటెంట్లు హతమయ్యారు.

సరిహద్దుకు వేలాది బలగాలు

గాజా సరిహద్దు వైపునకు 30 వేల మంది బలగాలను తరలించిన ఇజ్రాయెల్ సైన్యం.. గ్రౌండ్ ఆపరేషన్ చేపట్టేందుకు రాజకీయ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయి. గ్రౌండ్ ఆపరేషన్‌తో హమాస్ గ్రూపు టాప్ రాజకీయ, సైనిక నాయకత్వాన్ని హతమార్చడం ద్వారా గాజాను పూర్తిగా తమ అధీనంలోకి తెచ్చుకోవాలని ఇజ్రాయెల్ లక్ష్యంగా పెట్టుకొన్నదని న్యూయార్స్ టైమ్స్ కథనం పేర్కొన్నది.

గుక్కెడు నీటి కోసం అవస్థలు

23 లక్షల మంది ప్రజలు నివాసం ఉండే గాజా స్ట్రిప్ వణికిపోతున్నది. ఆహారం, నీరు, ఇంధనం లేక స్థానిక ప్రజలు అల్లాడిపోతున్నారు. గుక్కెడు మంచి నీరు, బ్రెడ్ దొరకడం లేదని గాజా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర గాయాలపాలైన బాధితులతో స్థానిక దవాఖానలు కిక్కిరిసిపోతున్నాయి. అత్యవసర ఔషధాలు, ఇతర వైద్య సామగ్రి కొరతతో వైద్యులు వారికి చికిత్స అందించలేక చేతులెత్తేయాల్సిన పరిస్థితి నెలకొన్నది.

బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలకు 'ఉపాధి' సెగ

కోల్‌కతా: బెంగాల్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నాయకులకు 'ఉపాధి హామీ' సెగ తగులుతున్నది. ఉపాధి బకాయిలను కేంద్రంలోని బీజేపీ సర్కారు చెల్లించకపోవడంపై బెంగాల్ ప్రజలు రాష్ట్ర బీజేపీ నేతలను నిలదీస్తున్నారు. రాష్ట్రానికి విడుదల చేయాల్సిన నిధుల్ని మోదీ సర్కార్ విడుదల చేయటం లేదన్న ఆగ్రహం ప్రజల నుంచి వ్యక్తమవుతున్నది. కూచ్ బెహార్ జిల్లా బీజేపీ ఎమ్మెల్యే బారెన్ చంద్రబర్మన్‌కు వ్యతిరేకంగా సితాల్‌కుంచ్ నియోజక వర్గ ప్రజలు ఆదివారం నిరసనకు దిగారు. 'ఉపాధి హామీ' పథకం బకాయిల్ని వెంటనే విడుదల చేయాలని ఆయన్ని ఘెరావ్ చేశారు.

అమెరికాలో భారీ అంబేద్కర్ విగ్రహం

వాషింగ్టన్ : దేశంలోనే అతిపెద్దదైన హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ప్రతిరూపంగా నిర్మించిన భారత రాజ్యాంగ నిర్మాత 19 అడుగుల పొడవైన విగ్రహాన్ని అమెరికాలో ఆవిష్కరించారు. భారత్ వెలుపల ఇంత పొడవైన విగ్రహాన్ని ప్రతిష్ఠించడం ఇదే ప్రథమం. అమెరికా రాజధానికి సమీపంలోని మేరీల్యాండ్ సబర్బ్ ప్రాంతంలో 13 ఎకరాల విస్తీర్ణంలో, వైట్‌హౌస్‌కు 22 మైళ్ల దూరంలోని అకోకీక్ టౌన్‌షిప్‌లో దీన్ని ఏర్పాటుచేశారు. ఈ 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ' ప్రారంభోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ శిల్పి రామ్ సుతార్ నిర్మించిన ఈ విగ్రహం హైదరాబాద్‌లో నిర్మించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి ప్రతిరూపంగా నిర్మించారు.

రాజస్థాన్‌లో భారీగా నగదు, డ్రగ్స్, మద్యం స్వాధీనం

జైపూర్: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న కాంగ్రెస్ పాలిత రాజస్థాన్‌లో భారీగా నగదు పట్టుబడుతున్నది. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత రూ.63 కోట్ల విలువైన అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు, బంగారం, నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర పోలీసులు, ఎక్సైజ్, నార్కొటిక్స్, ఆదాయపు పన్ను శాఖల అధికారులు నిర్వహించిన దాడుల్లో వీటిని స్వాధీనం చేసుకున్నట్లు చీఫ్ ఎలక్టొరల్ ఆఫీసర్ ప్రవీణ్ గుప్తా చెప్పారు. నవంబరు 25న రాజస్థాన్‌లో పోలింగ్ జరుగనుంది.

కాంగ్రెస్‌కు '9' సెంటిమెంట్

భోపాల్, అక్టోబర్ 15: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 144 మంది అభ్యర్థుల పేర్లతో కాంగ్రెస్ తొలి జాబితాను ఆదివారం విడుదల చేసింది. అయితే కాంగ్రెస్ ఇక్కడ తన '9' నంబర్ సెంటిమెంట్‌ను ఫాలో అయింది. అందుకే తొమ్మిది సంఖ్య కలిసొచ్చేలా 'నవ'రాత్రి ఉత్సవాల మొదటి రోజున జాబితాను విడుదల చేసింది. అలాగే 144 సీట్లకు (1+4+4=9) అభ్యర్థులను ప్రకటించింది. కచ్చితంగా ఉదయం 9 గంటలకు ఈ లిస్టు విడుదల చేసింది.

మిలిటెంట్ల సమ్మెతో స్తంభించిన మణిపూర్

భారత్‌లో నాడు రాష్ట్ర విలీనంపై నిరసన

ఇంఫాల్: భారతదేశంలో మణిపూర్ విలీనాన్ని వేర్వేరు మిలిటెంట్ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. 1949 అక్టోబరు 15న జరిగిన విలీనాన్ని నిరసిస్తూ ఆదివారం ఈ సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా సమ్మె నిర్వహించాయి. దీంతో సాధారణ జనజీవనం ప్రభావితమైంది. వ్యాపార సంస్థలు, మార్కెట్లను మూసివేసినట్లు అధికారులు తెలిపారు. కొన్ని ప్రైవేటు వాహనాలు మినహా ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. ఐదు నిషిద్ధ మిలిటెంట్ సంస్థలు కలిసి ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. భారత్‌లో విలీనానికి నాడు మణిపూర్ మహారాజు బుద్ధచంద్ర సంతకం చేయడమే రాష్ట్రంలో అశాంతికి కారణమని మిలిటెంట్ గ్రూపులు ఆరోపిస్తున్నాయి.

మాజీ సీఈసీ గిల్ కన్నుమూత

న్యూఢిల్లీ: భారత ఎన్నికల సంఘం మాజీ ప్రధాన కమిషనర్, కేంద్ర మాజీ మంత్రి మనోహర్ సింగ్ గిల్ కన్నుమూశారు. 86 ఏండ్ల గిల్ స్వల్ప అస్వస్థతతో దక్షిణ ఢిల్లీలోని ఒక దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. గిల్ అంత్యక్రియలు సోమవారం నిర్వహిస్తారు. ఆయన 1996 డిసెంబర్ నుంచి 2001 జూన్ వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా వ్యవహరించారు. టీఎన్ శేషన్ సీఈసీగా ఉన్నప్పుడు గిల్‌తో పాటు జీవీజీ కృష్ణమూర్తి సభ్యులుగా ఉండేవారు. గిల్ తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించి రాణించారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై 2008లో కేంద్ర క్రీడాశాఖ మంత్రిగా పనిచేశారు.

బీజేపీ, టీఎంసీ ఎంపీల వాగ్యుద్ధం

న్యూఢిల్లీ: బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్ర మధ్య వాగ్యుద్ధం జరిగింది. దర్శన్ హీరానందానీ అనే వ్యాపారవేత్త ప్రయోజనాలను కాపాడటం కోసం పార్లమెంటులో ప్రశ్నలు అడగడానికి మహువా ముడుపులు స్వీకరించారని, దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు దూబే ఆదివారం లేఖ రాశారు. దీనిపై మహువా స్పందిస్తూ, దూబే నిజమైన డిగ్రీని కొనుక్కోవడానికి వీలుగా ఓ కళాశాలను కొనేందుకు తాను తన అక్రమ సంపాదనను ఉపయోగిస్తున్నానని అన్నారు. ఈ ట్వీట్‌ను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ట్యాగ్ చేశారు. ఫేక్ డిగ్రీవాలాకు వ్యతిరేకంగా అనేక ప్రివిలెజ్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి దర్యాప్తు చేయడం పూర్తయిన తర్వాత తన వద్దకు రావాలని అన్నారు.

మన టెక్నాలజీని కోరిన అమెరికా

ఇస్రో చైర్మన్ సోమనాథ్

రామేశ్వరం: చంద్రయాన్-3 విజయం నేపథ్యంలో రాకెట్ల తయారీకి సంబంధించి మనదేశ సైంటిస్టులు వాడిన టెక్నాలజీని తమతో పంచుకోవాలని అమెరికా కోరినట్టు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ వెల్లడించారు. అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి రాకెట్ల తయారీ అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని , చంద్రయాన్-3 టెక్నాలజీ తెలుసుకునేందుకు అమెరికా నిపుణులు ఆసక్తి కనబర్చారని అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 92వ జయంతి సందర్భంగా శనివారం రామేశ్వరంలో ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 'భారత టెక్నాలజీనిని అమెరికా అడిగింది. దీనిని బట్టి రాకెట్ టెక్నాలజీలో భారత్ సాధించిన విజయాన్ని విద్యార్థులు అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

మరో 45 కోట్లు!

మొదటిపేజీ తరువాయి...

తాజాగా మరో కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కాంతరాజ్‌కి సన్నిహితుడైన బిల్డర్ సంతోష్ ఇంట్లో రూ.45 కోట్లు లభ్యం కావడం సంచలనంగా మారింది. 3 ట్రంకు పెట్టెలు, 3 బ్యాగులు, 1 సూట్‌కేసులో సర్దిపెట్టిన ఆ డబ్బును అధికారులు సీజ్ చేశారు. పట్టుబడిన డబ్బు గురించి సంతోష్‌ను ఐటీ అధికారులు ప్రశ్నించగా.. అది కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్సీ బెమెల్ కాంతరాజ్‌ది అని చెప్పడం సంచలనంగా మారింది.

ఆ డబ్బంతా కాంగ్రెస్ నేతదే..

గత 10 రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహిస్తున్న ఐటీ అధికారులు పక్కా సమాచారంతో శనివారం బెంగళూరులోని రాజాజీనగర్‌లో ఉన్న కేతమరనహల్లి అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో తనిఖీలు చేపట్టారు. బిల్డర్ సంతోష్ ఆనంద్ నివాసంలో ఉదయం 6 గంటల నుంచి జరిపిన సోదాల్లో రూ.45 కోట్ల మేర నగదు గుర్తించారు. ఇప్పటికే కాంగ్రెస్ నేత, కర్ణాటక కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అంబికాపతి ఇంట్లో దొరికిన నోట్ల కట్టలతో కండ్లు బైర్లు కమ్మిన ఐటీ అధికారులు.. మరోసారి దొరికిన భారీ మొత్తం చూసి షాక్‌కు గురయ్యారు. దీంతో మరింత మంది అధికారులను పిలిచారు. తాజాగా దొరికిన డబ్బు గురించి సంతోష్ ఆనంద్‌ను అధికారులు రోజంతా విచారించారు. ఈ